క్లుప్తంగా

ఓటు హక్కు వజ్రాయుధం



మాట్లాడుతున్న తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి

కనిగిరి రూరల్: ప్రజాస్వామ్యంలో విద్యార్థి, యువత ఓటరుగా నమోదై.. ఓటు హక్కు వినియోగించుకొని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని తహసీల్దార్ సీహెచ్ అశోక్‌కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు ప్రిన్సిపాల్ నారబోయిన వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సీహెచ్ అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఒక ఆయుధం లాంటిదిగా అభివర్ణించారు. డిప్యూటీ తహసీల్దార్ రవి శంకర్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ లావణ్య, ఏఎస్ఓ రమణా రెడ్డి, వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రామన విజయలక్ష్మి, బీఎల్ఓలు, కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు



విద్యుత్ అదాలత్‌లో పాల్గొన్న అధికారులు

కనిగిరి రూరల్: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికే విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎస్ విక్టర్ ఇమ్మానియేల్ అన్నారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ కట్టా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ అదాలత్‌లో 15 మంది ఫిర్యాదు చేయగా 11 కేసులను సత్వరం పరిష్కరించామన్నారు. మిగిలిన ఫిర్యాదులను తక్షణ పరిశీలనకు సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో డీఈఈ ఏ వీరయ్య, ఏడీఈ ఆర్ ఉమాకాంత్, కమిటీ సభ్యులు, ఎస్ఏఓ సుబ్బారావు, ఏఈలు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల అందజేత



హెచ్‌ఎంకు కుర్చీలు అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతల దాతృత్వం అభినందనీయమని శీలవారిపల్లె కదిరి వెంకటనరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ హెచ్‌ఎం నాగినేని తిరుపతయ్య అన్నారు. కోవిలంపాడు మాజీ సర్పంచ్ సయ్యద్‌బీబీ దౌలత్ 25 కుర్చీలు, ఎంపీటీసీ మాజీ సభ్యులు మూరం కాశిరెడ్డి 20 కుర్చీలను తమ సొంత నిధులతో సమకూర్చి బుధవారం పాఠశాల హెచ్‌ఎంకు అందజేశారు.

పోలీసులకు..దొంగల సవాల్..

టంగుటూరులో వరుస దొంగతనాలు పోలీసులకు సవాల్ విసురుతున్నాయి. జాతీయ రహదారిపై ఉన్న టంగుటూరులో దొంగతనాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. అయితే దొంగతనాలను నివారించడంలో.. సొత్తు రికవరీలో పోలీసుల వైఫల్యం స్పష్టం కనిపిస్తోంది. దీంతో దుండగులు దర్జాగా చోరీ చేసుకొని తమ పనికానిచ్చేస్తున్నారు. గత నాలుగు నెలలో జరిగిన చోరీ కేసుల్లో కేవలం ఒక్క కేసులోనే పోలీసులు రికవరీ చేయగాలిగారంటే మండలంలో పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

- టంగుటూరులో వరుస దొంగతనాలు
- దొంగలను పట్టుకోవడంలో పోలీసుల వైఫల్యం
- చోరీల్లో రికవరీలు అంతంతమాత్రమే
- తాళాలు వేసి బయటకు వెళ్లాలంటే భయపడుతున్న ప్రజలు
- పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే పేకాట శిబిరం



టంగుటూరులో చైన్ స్నాచింగ్ బాధితురాలితో మాట్లాడుతున్న పోలీసులు(ఫైల్)



టంగుటూరు కూల్‌డ్రింక్ దుకాణంలో వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

టంగుటూరు: టంగుటూరులో వరుస దొంగతనాలతో ప్రజలు ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్లాలంటే జంకె పరిస్థితులు నెలకొన్నాయి. తాళాలు వేసి ఉన్న గృహాలు, దుకాణాలు, మహిళ మెడలో చైన్ అపహరణలు..ఇలా ఎన్నో ఘటనలు ఈ నాలుగు నెలల్లో జరిగాయి. కానీ పోలీసులు వీటిని నివారించడంలో విఫలమయ్యారు. పోలీసులు కేవలం పోలీస్ స్టేషన్‌కే పరిమితం కావడంతో దుండగులను ప్రజల సొత్తును దోచుకెళుతున్నారు. కేసు విచారణలోనూ పోలీసుల అలసత్వం కారణంగా బాధితులకు సొమ్ము రికవరీ చేయలేకపోతున్నారు. టంగుటూరు పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే పేకా శిబిరం నిర్వహిస్తున్నా పట్టించుకోకపోవడం లేదు.

గత నాలుగు నెలల్లో జరిగిన చోరీల్లో కొన్ని

☛ ఈ ఏడాది ఆగస్టు 8న కొరిశపాడు మండలం దైవాలరావూరు గ్రామానికి చెందిన చిన్నమ్మాయి అనే మహిళ టంగుటూరులో బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు ఒంగోలు డిపోలో బస్సు ఎక్కింది. బస్సు దిగి వివాహానికి హాజరైన తరువాత బ్యాగులో ఉండాల్సిన 12 సవర్ల బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఎవరో ముగ్గురు మహిళలు తూర్పు నాయుడుపాలెం వద్ద బస్సు ఎక్కి..టంగుటూరు బస్టాండ్‌లో దిగారు. వారిపై ఆమె అనుమానం వ్యక్తం చేసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసులో ఇంత వరకు రికవరీ చేయలేదు.

☛ ఆగస్టు 9న కొండపి మండలం చోడవరం గ్రామానికి చెందిన బాలునేని వెంకట రమణ అనే మహిళ తూర్పు నాయుడుపాలెం జాతీయ రహదారి పక్కన ఆటో కోసం వేచి ఉంది. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పోలీసులమని నమ్మించి రహదారిపై తనిఖీలు చేస్తున్నామని బంగారు జాగ్రత్త అని చెప్పారు. ఆమె మెడలో ఉన్న 3 సవర్ల బంగారు చైను, 5.3 సవర్ల బంగారు గాజులు, 1.30 సవర్ల కాశికాయలు మొత్తం 10 సవర్ల బంగారు ఆభరణాలు ప్యాక్ చేసి ఇచ్చారు. సదరు మహిళ ఆటో ఎక్కి టంగుటూరులో దిగి ప్యాకెట్ విప్పి చూడగా అందులో రాళ్లు కనిపించాయి. దీంతో ఒక్కసారిగా కంగుతిన్న 10 సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురి కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

☛ ఆగస్టు 12న టంగుటూరులో కూల్‌డ్రింక్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తి రూ.25 వేల నగదును దుకాణం సరుగులో పెట్టి రాత్రికి ఇంటికి వెళ్లాడు. మరుసటిరోజు ఉదయం వచ్చి చూడగా దుకాణం వెనుక వైపు తలుపులు పగులగొట్టి రూ.25 వేల నగదును అపహరించారు.

☛ ఆగస్టు 25న సెంటర్‌లోని సింగరాయకొండ రోడ్డులో భ్రమరాంబ మల్లికార్జున పాల దుకాణంలో రూ.1.33 లక్షల నగదు దుకాణంలో ఉంచి ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూసేసరికి దుకాణం షెల్టర్ తాళాలు పగులగొట్టి అందులోని వస్తువులు చెల్లాచెదురు చేసి రూ.1.33 లక్షల నగదు అపహరించారు.

☛ సెప్టెంబర్ 3వ తేదీ స్థాని కొండపి రోడ్డులోని వినాయక హోటల్‌లో వెనుక తలుపు తెరిచి హోటల్ కొంటర్‌లో ఉన్న రూ.6 వేల నగదు అపహరించారు.

☛ సెప్టెంబర్ 3వ తేదీనే స్థానిక సింగరాయకొండ రోడ్డులో వీరమ్మ కాంప్లెక్స్‌లోని కొరియల్ సర్వీసులో ఓ వ్యక్తి వస్తువులు విదేశాలకు పార్శిల్ చేయాలని మాయమాటలు చెబుతూ దుకాణంలోని రూ.13 వేల విలువైన సెల్‌ఫోన్ చోరీ చేశాడు.

☛ అక్టోబర్ 11న టంగుటూరు చెందిన పమిడి రంగమ్మ అమ్మ మహిళ పోలేరమ్మ గుడికి వెళ్లి తిరిగి వెళ్తున్న సమయంలో విష్ణాలయం గుడి సమీపంలో ఇద్దరు గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వెళుతూ అడ్రస్ అడుగుతున్నట్లు నటించి మహిళ మెడలోని 3 సవర్ల బంగారు చైన్‌ను లాక్కొని పరారయ్యారు.

☛ అక్టోబర్ 17న స్థానిక విష్ణాలయ వీధిలో ఇంట్లో ఉన్న మహిళ వద్ద 8 సవర్ల బంగారం అపహరించుకుని పోగా పోలీసులు విచారణలో తిరిగి ఇప్పించారు.

ఇలా టంగుటూరులో దొంగతనాలు రోజు రోజుకు పెరుగుతున్నా పోలీసులు వాటిని ఛేదించడంలో గానీ, నివారించడంలో గానీ విఫలమవుతున్నారు. వీటికి తోటు అసాంఘిక కార్యకలాపాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. టంగుటూరు–అనంతవరం గ్రామాల మధ్య మందుబాబు రోడ్డుపైనే బైఠాయించి మద్యం తాగుతూ రచ్చ చేస్తుండటంతో గ్రామస్తులు రాత్రిళ్లు ఆ గ్రామాల ప్రజలు ప్రయాణం చేయాలంటే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అనంతవరం గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే టోల్ ప్లాజా సమీపంలో ఉన్న పత్తిపాటి వారి డొంకలోనూ ఇదే పరిస్థితి. దీంతో పొలాలకు వెళ్లే రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. జాతీయ రహదారి సర్వీసు రోడ్లల్లో, ఆలకూరపాడు, వెలగపూడి, ఎం. నిడమానూరు, కొణిజేడు గ్రామాల్లో రోడ్లపై మందుబాబులు బైఠాయించి దారిన పోయే ప్రయాణికులకు అసౌకర్యానికి గురిచేస్తున్నారు.



మందుబాబులు ఉండే టంగుటూరు - అనంతవరం రోడ్డు

15వ ఫైనాన్స్ నిధులపై ఆరా



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

కొండపి: ప్రభుత్వం నుంచి వచ్చిన 15వ ఫైనాన్స్ నిధులపై జెడ్పీ సీఈఓ చిరంజీవి ఎంపీడీఓలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆరు మండలాల ఎంపీడీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 15వ ఫైనాన్స్ నిధులపై జమ, ఖర్చుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్‌పీసీఐ సర్వే వివరాలు తెలుసుకొని త్వరగా పూర్తి చేసేలా చూడాలన్నారు. అనంతరం బీసీ కాలనీలోని సీసీ రోడ్లను పరిశీలించారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



టంగుటూరులో మాట్లాడుతున్న ఎంఈఓ బాలాజీ

టంగుటూరు: గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిసినట్లు గ్రంథపాలకుడు గుమ్మడి వర్ధన్‌రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సర్పంచ్ మద్దిరాల మమత, ఎంఈఓ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా వివిధపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఎంఈఓ ఎస్ రమణయ్య మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు మహ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐ ఎస్‌కే ఖాజావలి



మాట్లాడుతున్న సీఐ సోమశేఖర్



పీసీపల్లి: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కోటయ్య

కనిగిరి రూరల్: విద్యార్థులు, యువత సైబర్ నేరాలపై, మోసాలపై అవగాహన కల్గి ఉండాలని సీఐ ఎస్‌కే ఖాజావలి అన్నారు. స్థానిక ఆల్ఫా డిగ్రీ కళాశాలలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు, మహిళా, పిల్లల నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలు తదితర అంశాల గురించి వివరించారు. ఎస్సై టి.శ్రీరాం, ప్రిన్సిపాల్ చెంచుబాబు, సమీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: సైబర్ నేరాలు, లైంగిక దాడులపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మాధవరావు అన్నారు. మండలంలోని మహ్మదాపురం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ జి.పెద్దిరాజు, హెచ్‌ఎం వై.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మర్రిపూడి: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సీఐ సోమశేఖర్ అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో అభ్యంతకర పోస్టులు పెట్టడం నేరమన్నారు. వాహనదారులు విధిగా నిబంధనలు పాటించాలన్నారు. ఎస్సై రమేష్బాబు, కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు పాల్గొన్నారు.

పీసీపల్లి: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై కోటయ్య అన్నారు. మండల పరిధిలోని పెద్ద అలవలపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకొని పట్టుదలతో కష్టపడి చదివి ముందుకు సాగాలన్నారు. ఏదైనా అసాంఘిక కార్యకలాపాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు



ప్రమాద ఘటనతో కాలుతున్న ద్విచక్రవాహనం



క్షతగాత్రుడు లైన్‌మన్ సలీం బాష

- నుజ్జు నుజ్జయిన లైన్‌మన్ సలీం ఎడమ కాలు

కనిగిరి రూరల్: కనిగిరి నుంచి అలవలపాడుకు వెళ్తున్న బైక్‌ను అదే దారిలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న అలవలపాడు విద్యుత్ లైన్‌మన్‌కు ఎస్‌కే సలీం బాషకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెలితే.పెద అలవలపాడు లైన్‌మన్ ఎస్‌కే సలీమ్ బాష విధి నిర్వహణలో భాగంగా పెద అలవలపాడు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో కనిగిరి మండలం అజీస్‌పురం వద్ద వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో లైన్‌మన్ సలీం కింద పడటంతో తలకు గాయాలై ఎడమకాలు మోకాలు కింది భాగం పూర్తిగా విరిగి ఎముకలు బయటకు వచ్చాయి. బైక్ పూర్తిగా కాలి బూడిదైంది. స్థానికులు వెంటనే క్షతగాత్రున్ని108 వాహనంలో కనిగిరి ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్థమయ్యే రీతిలో బోధన చేయాలి

సీఎస్‌పురం(పామూరు): విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనావేసి వారికి అర్థమయ్యే సులభతర పద్ధతిలో విద్యాబోధన చేయాలని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. సీఎస్‌పురం, డీజీపేట స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరైన ఆయన ఉపాధ్యాయులకు బోధనా పద్ధతుల్లో పలు సూచనలు చేశారు. ఇచ్చారు. వచ్చే వార్షిక పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు సాధించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎంఈఓ కొండారెడ్డి

కాంప్లెక్స్ చైర్మన్ షేక్.ఖాదరున్నీసాబేగం, కిరణ్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రభాకర్ శర్మ

పీసీపల్లి: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ప్రభాకర్‌శర్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మండలస్థాయి అధికారులు, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ఫాగింగ్, బ్లీచింగ్ ప్రతి గ్రామంలో పిచికారీ చేయాలన్నారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ మంజుల, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

రమణయ్యను పరామర్శించిన దద్దాల



రమణయ్యను పరామర్శిస్తున్న దద్దాల నారాయణ

కనిగిరి రూరల్: మండలంలోని పునుగోడుకు చెందిన కోనంకి రమణయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా ఎడమకాలు కోల్పోయి.. ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ రమణయ్య ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, వైస్ ఎంపీపీ లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, కటికల వెంకట రత్నం, జి.ఆదినారాయణరెడ్డి, లక్కిరెడ్డి హనుమారెడ్డి, సర్పంచ్ తిమ్మయ్య, పల్నాటి భాస్కర్‌రెడ్డి, గొబ్బిళ్ల శ్రీను, కొండారెడ్డి, వెంకటరెడ్డి ఉన్నారు.

మతతత్వ పార్టీని గద్దె దింపాలి

పామూరు: కేంద్రంలోని మతతత్వ బీజేపీని గద్దె దింపడమే కమ్యూనిస్టు పార్టీల లక్ష్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అన్నారు. స్థానిక అమ్మ ఫంక్షన్ హాలులో బుధవారం సీపీఎం మండల 6వ మహాసభ షేక్.ఖాదర్‌బాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదలపై ధరలతో అధిక భారాలు మోపాయన్నారు. పామూరు మండల కార్యదర్శి కొమ్ములపాటి మాల్యాద్రి, సీఎస్‌పురం మండల కార్యదర్శి ఊసా రాజ్యలక్ష్మి, ఊసా వెంకటేశ్వర్లు, ఐద్వా నాయకులు సయ్యద్ షమ్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

టంగుటూరు: మండలంలోని కారుమంచిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దాసరి మాధవిని అదుపులోనికి తీసుకొని ఐదు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగమల్లీశ్వరరావు తెలిపారు. ఎక్కడైనా బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీమా పథకంలో నమోదు చేసుకోవాలి

సీఎస్‌పురం(పామూరు): రైతులు రబీ 2024–25లో తాము సాగుచేసిన పంటలను ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని ఏకునాంపురం, గుంత చెన్నంపల్లి గ్రామాల్లో బుధవారం రైతులకు బీమా యోజన పథకం, ప్రీమియంపై గురించి వివరించారు. వరి, పప్పుశనగ, కందిని పంటలను ఆశించే తెగుళ్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఏఈఓ పావలి శ్రీనివాసులు, రైతుసేవాకేంద్రం సిబ్బంది ఎ.వెంకటేశ్వర్లు, ఎం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కొండపి: శనగ, వరి, మిరప సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని ఏడీఏ నిర్మలకుమారి అన్నారు. మండలంలోని పెరిదేపి, ముప్పరాజుపాలెం, నెన్నూరుపాడు, గుర్రపడియ గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. శనగ సాగు చేసే రైతులు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు.

8 మంది జూదరుల అరెస్టు

సింగరాయకొండ: మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలో రైల్వే ట్రాక్ పక్కన పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 8 మందిని అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. వారి వద్ద నుంచి రూ.9,005, సెల్ ఫోన్లు, మోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

కనిగిరి రూరల్: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి, లాభాలను పొందాలని ఏఓ జ్యోత్స్నాదేవి అన్నారు. మండలంలోని గురువాజీపేట, వంగపాడు రైతు భరోసా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. కంది, మినుము, వరి, బొబ్బర పంటల్లో ఆశిస్తున్న తెగుళ్లు, పురుగులు, చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.

మర్రిపూడి: మండలంలోని చిమట, రామాయపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం గురించి వివరించారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు మహేంద్రాచారి, పశు సంవర్ధక శాఖ సిబ్బంది, మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): ప్రతి రైతు తాను పండించే పంటకు ఈ క్రాప్ నమోదు చేయించుకోవటంతో పాటు పంటల వారీగా బీమా ప్రీమియం చెల్లించుకోవాలని వ్యసాయాధికారి పి. యుగంధర్‌రెడ్డి, ఉద్యానవన శాఖాధికారి ప్రత్యూష తెలిపారు. జరుగుమల్లి మండలం ఎడ్లూరుపాడు, జెజె కండ్రిక గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. మిరప పంటను పరిశీలించి రైతులకు తగిన సూచనలు చేశారు.

హనుమంతునిపాడు: రైతులు సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని డీఆర్‌పీ వ్యవసాయాధికారి వీవీ శేషమ్మ అన్నారు. మండలంలోని కోటతిప్పలలో రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. ఏడీఏ కేవీ రమణ, ఏఓ కె.రమణ, వైఎస్ ఎంపీపీ శోభ, ఇతర నేతలు పాల్గొన్నారు.

పీసీపల్లి: చీడపీడల పట్ల అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి ప్రకాష్‌రావు అన్నారు. మండల పరిధిలోని మారెళ్ల, తలకొండపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు.

టంగుటూరు: మండలంలోని ఎం నిడమానూరు, పొందూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యులు ధనలక్ష్మి మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గడ్డి పెంచుకునే రైతులకు తోడ్పాటు అందిస్తామన్నారు. వ్యవసాయాధికారి స్వర్ణలత, సహాయకులు సుభాషిణి, వేణుమణి, కవిత, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సింగరాయకొండ: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరిలో ద్రవ జీవామృతం పిచికారీ చేస్తే పంటను చీడపీడల నుంచి కాపాడుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి అధికారి ఏ వెంకటరమణ అన్నారు. మండలంలోని బింగినపల్లి పంచాయతీలో బుధవారం రైతు పాకల చెంచయ్య వరి పొలంలో ద్రవజీవామృతం తయారు చేయించి పైరుపై పిచికారీ చేయించారు. ఈ మిశ్రమం ద్వారా పైరుపై తెగుళ్లను నివారించటంతో పాటు మొక్కలో అధిక పిలకలు వచ్చి దిగుబడి కూడా బాగా పెరుగుతుందని వివరించారు.